పెళ్లి సంబంధం పని మీద అర్జెంటుగా గూడూరు వెళ్ళాలి! రైల్వే రిజర్వేషన్ ఆఫీసు కిటకిటలాడుతోంది! ఓ అరగంట ఎంక్వైరీ క్యూలో నిలబడ్డాక తెలిసిన విషయం ఖచ్చితంగా టికెట్ దొరకదని!

ఏం చెయ్యాలో పాలుబోక ఆలోచిస్తూ నిలబడ్డాను. నేను బైటకి రావడం గమనించి ఓ వ్యక్తి దగ్గరికొచ్చి – "ఎక్కడికెళ్ళాలి సార్?" ప్రశ్నిస్తే – చెప్పాను.

"ఏం సార్? టిక్కెట్ కావాలా?" మళ్ళీ ప్రశ్నించాడు. ఎగాదిగా చూసి అవునన్నాను. "ప్రయాణం ఎప్పుడు సార్?" ఇంకో ప్రశ్న సంధిస్తే కొంచెం చిరాగ్గా –

"ఎప్పుడో అయితే టెన్షన్ ఎందుకయ్యా? ఇవాల్టికే – సాయంత్రం బైలుదేరి వెళ్ళాలి!...



# తత్కాలం

అర్జెంట్!!" చెప్పాను కొంచెం గట్టిగానే!

"టెన్షన్ ఎందుకు సార్! టికెట్ దొరికిపోతుంది!" కూల్‌గా అన్నాడు.

ఆశ్చర్యంగా చూసాను.

"అవున్సార్! చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌కి ఒక టికెట్ ఉంది! కావాలా?"

ఆ ప్రశ్నకి జవాబు చెప్పాకుండా ఆలోచనల్లోకి కూరుకుపోయాను.

వీడెవడో దొంగ వెధవ! నన్ను బోల్తా కొట్టించి డబ్బులు కొట్టేద్దామని చూస్తున్నాడు. వాడి ఆటలు నా దగ్గర సాగుతాయా??

"ఏంటి సార్? తొందరగా చెప్పండి! ఇంకా స్పేపాగితే. ఆ ఒక్క టికెట్టూ దొరకదు!"

ఓహో! ఎరవేస్తున్నావా? నీ గాలానికి చిక్కే చేపని కానురా! మరోసారి అతన్ని ఎగాదిగా చూసి "కౌంటర్‌లో దొరకని టిక్కెట్ నీ దగ్గర ఎలా దొరుకుతుంది? ఇంతకీ నువ్వెవరు?" అనుమానంగా చూసాను.

"అవన్నీ మీకెందుకు సార్? మీక్కావాల్సింది గూడూరుకి టిక్కెట్. టిక్కెట్ ధర మీద ముప్ఫై రూపాయిలు ఎక్కువ పే చెయ్యండి చాలు!"

– వినగానే ఛర్రున కోపం వచ్చింది నాకు!

ఎక్కువ పే చెయ్యాలట! ఏం?... ఎందుకు చెయ్యాలి? ఎవడి బాబు సొమ్మని చెయ్యాలి? ఎక్కడ చూసినా లంచం! ఛీ-ఛీ- దేశం ఎంత నాశనమైపోతోంది? నీతి నిజాయితీ లేకుండా పోతోంది!!

మాటా పలుకులేకుండా ఎర్రబడ్డ మొహంతో నిలబడ్డ నన్ను చూసి "పలకరేంటి సార్? టికెట్ కావాలా-వద్దా??" నిలదీస్తున్నట్టు అడిగాడు.

"టికెట్ కావాలయ్యా! కానీ ఎక్కువెందుకు పే చెయ్యాలి?"

ఎందుకేంటి సార్? ప్రయాణం రోజున వచ్చి రిజర్వేషన్ కావాలంటే ఎలా దొరుకుతుంది?

"అదే ఎందుకు దొరకదూ అని?" రెట్టించాను.

"ఎక్స్‌ట్రా ఇవ్వనిదే పని జరగదు సార్!"

"అదే-ఎందుకు జరగదూ అని?" ఇంకాస్త గట్టిగా రెట్టించాను.

"పోండి సార్! మీకు టికెట్ దొరకదు!" అంటూ హేళనగా నవ్వుతూ వెళ్ళిపోయాడు. నాకీ వ్యవస్థ మీద, ప్రభుత్వం మీద కసి పెరిగింది. చిరాకుగా స్కూటర్ స్టార్ట్ చేస్తుండగా "హలో సార్!" – ఎదురుగా నవ్వుతూ రామం! మా ఇంటి ప్రక్కింటతను కనిపించాడు. "ఏంటి సార్? మళ్ళీ టూరు వెళ్తున్నారా?" ప్రశ్నించాడు.

"కాదండీ- మా బామ్మర్ది కూతురికి పెళ్ళి సంబంధం కోసం అర్జెంటుగా గూడూరు వెళ్ళాలి." అంటూ జరిగిందంతా చెప్పుకొచ్చాను!

**వారణాసి రామకృష్ణ**

అంతా విన్నాక అతను అన్నాడిలా– "మీకు తెలీదా? ఇలా అర్జెంటు జర్నీలు చేసేవారి కోసం రైల్వేవాళ్ళు తత్కాల్ స్కీమ్ పెట్టారు! ఆ స్కీమ్‌లో ఏ రోజు రిజర్వేషన్ ఆ రోజు ఇస్తారు! ఇంతకుముందు మన ఐడెంటిటీ ప్రూవ్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడలాంటివేమీ అక్కర్లేదు! ఎవరికైనా టికెట్ వెంటనే ఇస్తారు!"

ఆహా! ఇంతసేపూ ప్రభుత్వాన్ని తిట్టుకున్నా గానీ ఇంత మంచి పథకాలూ ప్రవేశ పెట్టారన్న మాట! తత్కాల్ టిక్కెట్లు ఇచ్చే కౌంటర్ పట్టుకుని మొత్తానికి టిక్కెట్ సంపాదించాను!

మెట్లుదిగి మళ్ళీ స్కూటర్ స్టాండు దగ్గరికొస్తుంటే ఇందాకటి వ్యక్తి కనిపించి– "ఏంటి సార్? రిటర్న్ వెళ్ళిపోతున్నారా?" కాస్త వ్యంగ్యంగా అడిగాడు. ఒళ్ళు మండుకొచ్చి– "రిటర్న్ వెళ్ళడమేంటి? నిక్షేపంగా టికెట్ కొనుక్కుని మరీ వెళ్తున్నా!"

ధీమాగా చెప్పాను. ఆశ్చర్యంగా చూసి– "టికెట్ దొరికిందా?" అన్నాడు.

"ఎందుకు దొరకదూ? తత్కాల్ స్కీమ్‌లో వెంటనే దొరికింది!"

చెప్పగానే అతను భళ్ళుమని నవ్వసాగాడు. అసహనంగా చూశాను. అతను నవ్వు ఆపి– "ముప్పైరూపాయలు ఎక్కువ పే చెయ్యండి సార్ అని అడిగితే అంతలా చిరాకుపడ్డారు కానీ రైల్వే వాళ్ళకి మాత్రం నూటాయాభై రూపాయలు ఎక్కువ సమర్పించుకున్నారన్న మాట!" అన్నాడు.

"ఏమిటీ?!" నిర్ఘాంతపోయాన్నేను.

"అవున్సార్! గూడురుకి మామూలు టిక్కెట్ ధర కంటే తత్కాల్‌లోనైతే నూటాయాభై ఎక్కువివ్వాలి. పైగా టిక్కెట్ ధర గూడూరు దాకా కాక చెన్నైదాకా ఇచ్చి ఉంటాడు! చూస్కోండి! అతను చెప్తుండగానే సెల్ రింగయింది! తీస్తే... అవతల మా బామ్మర్ది! గూడురు నుంచి మాట్లాడుతూ– "బావా! నువ్వింత అర్జెంటుగా రానవసరం లేదులే!" అన్నాడు! నెత్తి మీద బాంబు పడ్డట్టయింది.

"అదేం?"

"పెళ్ళి కొడుక్కి సెలవు దొరకడం కష్టమట! వచ్చే ఆదివారం వచ్చి అన్ని విషయాలు మాట్లాడుకుంటారట! నువ్వారోజుకి ప్లాన్ చేస్కుని రా బావా!" చెప్పేసి లైన్ కట్ చేశాడు.


"ఖర్మ! ఇప్పుడు మళ్ళీ క్యూలో నిలబడి టికెట్ క్యాన్సిల్ చేయించుకోవాలి!" చిరాగ్గా బైటికే అనేసి వెనక్కి తిరిగాను. "ఆగండి సార్! వేస్ట్! వెళ్ళకండి!" అతని గొంతు ఖంగుమంది. గిర్రున వెనక్కి తిరిగి. ఆశ్చర్యంగా చూస్తే– "మీరిప్పుడు ప్రయాణం మానుకున్నా టికెట్ ధర వాపసు ఇవ్వరు సార్!" అన్నాడు.

"ఎందుకివ్వరూ? కొంచెం కట్ చేసుకుని తక్కిన అమౌంట్ ఇస్తారు!"

"అదే మీ అజ్ఞానం సార్! తత్కాల్ స్కీమ్‌లో బుక్ చేసుకుంటే చచ్చినట్టు ట్రావెల్ చెయ్యాలి! లేదా టిక్కెట్ సొమ్ము గోడకి కొట్టిన సున్నంలా మర్చిపోవాలి!"

"అదేంటయ్యా?"

"అదంతే! రూల్ సార్! అయినా మీరు నెత్తిన టోపీ పెట్టే వాళ్ళని నమ్ముతారుగానీ నిజం మాట్లాడే వాళ్లని నమ్మరు సార్! అసలు మీకింకో షాకింగ్ న్యూస్ చెప్పనా? ఇప్పుడు మీరు కట్టిన టిక్కెట్ డబ్బు రైలు స్టార్టింగ్ పాయింట్ నుంచి గమ్యస్థానం దాకా ఛార్జీ కట్టినట్టు లెక్క! అంతేకానీ మధ్యలో ఒకవూరు నుంచి మరోవూరికి కాదు! అంటే మీరు ప్రయాణించని దూరానికీ తత్కాల్ స్కీమ్‌లో డబ్బులు కట్టేరన్నమాట!"



అతను చెబుతున్నది పూర్తిగా అర్థం చేసుకునే లోగానే అతను నిష్ఠూరంగా “అంతేలే సార్! మీరు నాబోటి నిరుద్యోగికి టిక్కెట్ ధర కంటే ముప్పై రూపాయలు ఎక్కువ ఇవ్వరుకానీ ప్రభుత్వం స్కీమ్ పేరుతో ఎంత ఎక్కువ సొమ్ము వసూలు చేసినా కిక్కురుమనరు! ట్రావెల్ ఏజన్సీ బోర్డు పెట్టి లైసెన్సు తీసుకుని ఆఫీసు నడిపేంత డబ్బులేక ఏదో ఉన్నంతలో పది టిక్కెట్లు ముందుగానే అడ్వాన్సు రిజర్వేషన్ చేయిస్తుంటాను సార్! నేను పెట్టిన పెట్టుబడికి టిక్కెట్‌కి పాతిక ముప్పై ఎక్కువ దొరికితే అదే చాలనుకుంటాను! నాబోటి వాళ్లకి ఎక్కువ ఇవ్వటానికి మీకు మనసొప్పదు గానీ గవర్మెంటుకి లంచం పొయ్యటానికి మీ మనసులో నీతి నిజాయితీలు, ఉన్నతమైన ఆలోచనలూ పుట్టవు!” గట్టిగా అన్నాడు.

అప్రయత్నంగా నేను “ఏంటీ? లంచమా?” నోరుతెరిచాను.

“మరిదాన్ని లంచం కాక మరే పేరుతో పిలుద్దాం సార్? ప్రజల కోసం, ప్రయాణీకుల సౌకర్యార్థం కోసం ప్రవేశపెట్టామని చెబుతున్న ఈ తత్కాల్ స్కీమ్ టిక్కెట్టు ధర ఎందుకని ఎక్కువ? ఏ కారణం చేత అంత డబ్బు ఎక్కువగా వసూలు చేస్తున్నారు? పైగా ప్రయాణీకుడు ప్రయాణించని దూరానికీ లెక్కగట్టి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు!! వాడికేదో అడ్డంకి వచ్చి జర్నీ పోస్టుపోన్ చేసుకుందాం అనుకుంటే ఆ అవకాశమూ ఇవ్వటం లేదెందుకని?? చెప్పండి సార్??”

అతను బాధగా రెట్టించి అడిగాడు.

ఈ సందేహాలకి సమాధానం– అవినీతి అవిటితనంతో అలరాడుతున్న వ్యవస్థ చెబుతుందా? అధికార చెవిటితనంతో అల్లాడుతున్న యంత్రాంగం ఇస్తుందా?? అసలు ప్రతి విషయంలో తాత్కాలిక తత్కాలేకానీ దూరదృష్టితో కూడిన సత్కాలం ఎప్పుడొస్తుంది?? ●